రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం

విజయవంతం చేయాలి

- జిల్లా వైద్య, విద్య, స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్.

చిత్తూరు, నవంబర్ 16 ప్రభాతవార్త: రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంను జిల్లా విద్యాశాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుండి శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా విద్యాశాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌లో భాగంగా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌లను సమన్వయం చేసుకుని పక్కాగా నిర్వహించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, సిడిపిఓలు, మెడికల్ ఆఫీసర్ల ద్వారా 0-6, 7-18 సంవత్సరాల మధ్య పిల్లలకు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో 0-6 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలకు సంబంధించి ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, 7-18 సంవత్సరాల మధ్య పిల్లలకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి బాధ్యత తీసుకోవాలన్నారు. చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌లో భాగంగా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పిల్లల వైద్య సేవల కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సిఫార్సు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లో 54,293 పిల్లలు, అలాగే 2,470 పాఠశాలల్లో 1,48,483 విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుండి ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నందు ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు 5 నెలల నుండి 5 సంవత్సరాల పిల్లల వరకు నాలుగు రకాల లోపాలపై ప్రతి శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు స్క్రీనింగ్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టుకతో లోపం(న్యూరల్, డౌన్ సిండ్రోమ్, గ్రహణ మొర్రి, నడుము భాగం అభివృద్ధి లోపం, సంక్రమణ కంటి పొర, పుట్టుకతో వచ్చే చెవుడు, సంక్రమణ గుండె జబ్బులు), రెండవది డెఫిషియన్సీ లోపాలు(రక్తహీనత, విటమిన్ ఎ, డి లోపం, తీవ్ర పోహకాహారలోపం, ఆయోడిన్ లోపం, గాయిటార్), మూడవది పిల్లల్లో వచ్చే వ్యాధులు(చర్మవ్యా ధులు, గజ్జి తామర, చెవి వ్యాధులు, రుమాటిక్ గుండెవ్యాధి, రియాక్టివ్ ఎయిర్ వే వ్యాధి, పిప్పి పళ్ళు, మూర్ఛ వ్యాధి), నాల్గవది పెరుగుటలో లోపాలు, డిజేబులిటీ వ్యాధులు(దృష్టి, వినికిడి సమస్యలు, నాడి సంబంధమైన చలన సమస్యలు, చలన సామర్థ్యంలో ఆలస్యం, మేధోపరమైన అసమానత, మాటలు నేర్చుకోలేకపోవడం, ఆటిజం, అభ్యసనా సమస్యలు, సావధానలోపం, అతి చురుకుదనం వల్ల కలిగే సమస్యలు, తలసీమియా) వంటి వాటిపై స్క్రీనింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రొగ్రాంకు వచ్చిన డాక్టర్లు ఈ పిల్లలను పరీక్షించి చికిత్సలు చేస్తారన్నారు. అలాగే చికిత్సకు వీలుకాని పిల్లలను ప్రతి మండలంలో వున్న భవిత స్కూలుకు రెఫర్ చేస్తారన్నారు. అక్కడ వీలు కాని పిల్లలకు జిల్లా ఆసుపత్రిలో డిఈఐసి సెంటర్‌లో వివిధ విభాగాల స్పెషలైజేషన్ డాక్టర్ల వద్దకు పంపి చికిత్స నిర్వహిస్తారన్నారు. అలాగే ఎముకలు, గ్రహణమెర్రిలకు తిరుపతి బర్డ్ ఆసుపత్రిలో ఉచితంగా సర్జరీ చేస్తారని, కంజునెంటల్ హార్ట్ పిల్లలకు తిరుపతి పద్మావతి ఆసుపత్రిలో ఉచితంగా సర్జరీ చేస్తారన్నారు. అలాగే కంటికి సంబంధించిన వ్యాధులకు తిరుపతి ఆరవిందో ఐ హాస్పిటల్‌లో ఉచిత చికిత్స చేస్తారన్నారు. అలాగే 6-18 సంవత్సరాల పిల్లలకు ప్రతి గురు, శనివారాల్లో వైద్యాధికారుల బృందం సంబంధిత పాఠశాలల్లో మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు స్క్రీనింగ్ చేస్తారన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జీ డిఎంహెచ్ఓ డాక్టర్ హనుమంతరావు, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, ఐసిడిఎస్ పిడి హైమావతి, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మీ, సమగ్ర శిక్షా ఎసిపి వెంకటరమణారెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, జిల్లా బిసీ సంక్షేమ అధికారి రబ్బానీ భాషా, జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మీ, ఎస్టీ సంక్షేమ అధికారి మూర్తి, వికలాంగుల సంక్షేమశాఖ ఎడి శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంహెచ్ఓలు తదితరులు పాల్గొన్నారు.

గాదంకి ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలో లారీ దగ్ధం

పాకాల, నవంబర్ 16, ప్రభాతవార్త

చిత్తూరు నుండి తిరుపతికి టమోటాల లారీ వెళ్తుండగా తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం గాదంకి ఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపంలో అతివేగంగా వెళ్లి డివైడర్‌ను ఢీకొనడంతో లారీ పల్టీ కొట్టి మంటలు చెలరేగి లారీ దగ్ధం అయిన సంఘటన శుక్రవారం రాత్రి దాదాపు 10 గంటల సమయంలో చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటల ఆర్పడానికి ప్రయత్నించారు. ప్రమాదంలో గాయపడిన లారీ డ్రైవర్, క్లీనర్‌ని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

కలుషిత ఆహారం తిని విద్యార్థులకు అస్వస్థత

ఆసుపత్రి పాలైన 17 మంది బాలికలు -మరో 15 మందికి వసతి గృహం లోనే వైద్యం
అప్రమత్తమైన అధికారి యంత్రాంగం -అధికారుల నిర్లక్ష్యం అంటూ విమర్శలు

తిరుపతి విద్య నవంబర్ 16,ప్రభాతవార్త: జిల్లాలో గడిచిన నాలుగు నెలలుగా గురుకుల వసతి గృహాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఎప్పుడు లేని విధంగా వింత పరిస్థితులను విద్యార్థులు ఎదుర్కోవా ల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో తిరుపతి నగరం బైరాగిపట్టెడ సమీపంలోని ట్రైబల్ బాలికల గురుకుల వసతి సముదాయంలో కలుషిత ఆహారం తిని 32 మంది విద్యార్థినిలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అస్వస్థతకు గురైన 17 మంది విద్యార్థినిలను హుటాహుటిన తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినిలను ఎం ఎం వార్డులో ప్రత్యేకంగా ఉంచి చికిత్సను అందించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని, గురుకుల పాఠశాలలో మెరుగైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు ఇందులో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వరకు ఆసుపత్రుల్లోనే వుండి వైద్య సేవలను పర్యవేక్షించారు. రుయా సూపరింటెండెంటు డాక రవి ప్రభు, విభాగాధిపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురుకుల విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడడంతో శనివారం మధ్యాహ్నం డిశ్చార్జ్ చేసి వసతి గృహానికి తరలించారు. అస్వస్థతకు గురైన 32 మంది విద్యార్థినుల్లో కొందరికి వాంతులు, మరికొందరికి విరోచనాలు, మరికొందరికి కడుపునొప్పి సమస్యలు ఎదురయ్యాయి. ఇందులో 17 మందిని రుయా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించగా 15 మందికి వసతి గృహం లోనే చికిత్సను అందించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం స్థిరంగానే ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కలుషిత ఆహారంతోనే

స్థానిక బైరాగి పట్టెడలోని ట్రైబల్ బాలికల గురుకుల వసతి సముదాయం లో శుక్రవారం రాత్రి విద్యార్థినిలు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం వండిన మెంతిపప్పు కూర తిరిగి రాత్రి కూడా వడ్డించడంతోని ఫుడ్ పాయిజన్ అయినట్లు అధికారులు అంచనాకు వచ్చారు. జిల్లా అధికారులు విద్యార్థినిలకు సరఫరా చేస్తున్న త్రాగునీరుతోపాటు ఫుడ్ పాయిజన్ కారణం గా భావిస్తున్న ఆహారాన్ని శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు తరలించారు.

అధికారుల నిర్లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా గడిచిన నాలుగు నెలలుగా ప్రభుత్వ గురుకుల విద్యార్థుల వసతి గృహాల్లో కలుషిత ఆహారం తిని పదుల సంఖ్యలో విద్యార్థిలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. వరుస ఘటనలు చోటుచేసుకుంటున్న జిల్లా అధికార యంత్రాంగం మొద్దు నిద్రలో ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సూర్యనారాయణ సైతం ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాన్ని పర్యవేక్షించలేదని విమర్శలు ఉన్నాయి. బిసి, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, అక్కడ పరిస్థితులను అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవాల్సిన ఎంతైనా అవసరం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామ పంచాయతీలకు ఊరట

కోట, నవంబర్ 16 ప్రభాతవార్త

కాసులు లేమి నుంచి ఇప్పుడిప్పుడే ఊరట పొందుతున్న పంచాయతీలకు మరింత ఉపశమనం లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 80 శాతం గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా, ఇప్పుడిప్పుడే వాటికి ఉపశమనం లభిస్తుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు సర్పంచులు అప్పులు తెచ్చి మరీ ఖర్చు చేసి బిల్లులు మంజూరు కాకపోవడంతో లబోదిబోమనేవారు. అయితే నాడు కేంద్రం నుంచి విడుదలైన నిధులు సైతం విద్యుత్ బకాయిలు పేరిట మినహాయించు కోవడం ఇబ్బందులు పడ్డారు. జగన్ ప్రభుత్వం తీరును నిరసిస్తూ గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటం చేసినా ఫలితం లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం కొలువు తీరగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ అంశంపై దృష్టి సారించారు. పాత బకాయిలు రెండు విడతలుగా విడుదల చేయించారు. ప్రస్తుతం విడుదల చేసిన నిధులను కేంద్రప్రభుత్వమే నేరుగా పంచాయతీల ఖాతాలకు కేటాయించనుంది.

మాజీ ఎంఎల్ఏ నారా రామ్మూర్తి నాయుడు మృతి

హైదరాబాద్ ఎఐజిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
నియోజకవర్గ ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం
నారావారిపల్లిలో అంత్యక్రియలకు ఏర్పాట్లు

చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు స్వయాన సోదరుడు మాజీ ఎంఎల్ఏ నారా రామ్మూర్తి నాయుడు శనివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో మృతి చెందారు. చంద్రగిరి మండలం, నారావారిపల్లిలోని రైతు కుటుంబానికి చెందిన నారా ఖర్జూర నాయుడు, అమ్మణమ్మల ద్వితీయ సంతానంగా జన్మించారు. ఆయనకు అన్న నారా చంద్రబాబు నాయుడు, సోదరీలు రాజేశ్వరి, హైమవతి వున్నారు. రైతుగా వ్యవసాయంలో రాణించిన ఆయన విద్యలో సైతం తిరుపతి ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. నాటకరంగంపై ఆసక్తితో తిరుపతిలో కళా పరిషత్ ఏర్పాటు చేసి నాటకాలను వేయడం ప్రారంభించారు. రాజకీయాలలో చంద్రబాబుకు తోడుగా నడుస్తూ 1977లో చంద్రగిరి, పులిచర్ల మండలాలలో విస్తృత ప్రచారం చేశారు. 1992లో రాజకీయ ప్రవేశం చేసిన ఆయన 1994లో టిడిపి అభ్యర్థిగా చంద్రగిరి నుండి బరిలోకి దిగి కాంగ్రెస్ అభ్యర్థి గల్లా అరుణకుమారిపై విజయం సాధించారు. 5 ఏళ్ళలో నియోజకవర్గ ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్నారు. 1996 నుండి మూడేళ్ళ పాటు రాష్ట్ర కబడ్డీ సంఘం చైర్మన్‌గా పనిచేశారు. ఈ సమయంలో చంద్రగిరిలో రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా 1998లో తిరుపతిలోని తారక రామారావు స్టేడియంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి, ముఖ్యఅతిథిగా నాటి హోమ్ మంత్రి దేవేందర్ గౌడ్‌ను తీసుకువచ్చారు. 1999 నుండి మానసికంగా అనారోగ్యం పాలవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తిరిగి ఆరోగ్యం కొంత మెరుగుపడటంతో నాటి పరిస్థితుల కారణంగా 2004లో తిరిగి ఇండిపెండెంట్‌గా చంద్రగిరి కాంగ్రెస్ అభ్యర్థి గల్లా అరుణకుమారి, టిడిపి అభ్యర్థి రామనాథం నాయుడుపై పోటీ చేశారు. ఈ పోటీలో ఓటమి చెందినప్పటికీ దాదాపు 36 వేలు ఓట్లను సాధించి ప్రధాన పార్టీల అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టించారు. నాటి నుండి రాజకీయాలకు దూరమైన ఆయన హైదరాబాద్‌లోని ఎఐజి హాస్పిటల్లో గుండె సంబంధిత అనారోగ్య సమస్యలకు వైద్య చికిత్సలు పొందుతూ తుదిశ్వాస విడిచారు.

-నేడు నారావారిపల్లిలో అంత్యక్రియలు

నారా రామ్మూర్తి నాయుడు భౌతికకాయాన్ని ఆదివారం తమ స్వగ్రామం నారావారిపల్లి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన అంత్యక్రియలకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి నగర కమీషనర్ .మౌర్య అధికారులతో కలసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీకాళహస్తీశ్వరాలయం, స్వర్ణముఖినదిలో కనువిందుచేస్తున్న విద్యుత్ కాంతులు

వెలుగులతో దేదీప్యమానం..

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త

కార్తీక మాసం పరమపవిత్రం, శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రం. ప్రతి ఏడాది కార్తీక మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం విద్యుత్ వెలుగులతో నిండిపోతోంది. దీనికి తోడు పవిత్ర స్వర్ణముఖినదిలో నీరు ఉండడంతో విద్యుత్ కాంతులు నీటిలో కనువిందు చేస్తూ పర్యాటకులను, భక్తులను, స్థానికులను ఆకర్షిస్తోంది. దీంతో శ్రీకాళహస్తీశ్వరాలయం వెలుగులతో నిండిపోయింది. ఈదృశ్యాన్ని చూడడానికి రెండు కళ్ళు చాలవంటే కనులు చాలవు. ఓవైపు ఆలయ విద్యుత్ వెలుగులు నిండిపోయి స్వర్ణముఖినదిలో కనువిందు చేస్తున్న దృశ్యం అందరినీ అలరిస్తోంది.

కూటమి ప్రభుత్వ హామీలను వెంటనే నెరవేర్చాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి

గూడూరు, నవంబర్ 16, ప్రభాతవార్త

ప్రస్తుత కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆ ఇళ్ళ నిర్మాణం కోసం ఐదు లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. శనివారం గూడూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా అధ్యక్షతన వహించారు. ఈ కౌన్సిల్ సమావేశమునకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాలని లేకుంటే గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య తేడా ఏమీ కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి సిమెంటు ఇసుక ఇనుము ఇటుక, కంకర ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. ఫ్రీ ఇసుక విధానం సక్రమంగా అమలు జరపాలని, అందరికీ ఇసుక అందుబాటులో ఉండే విధంగా కఠినంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన లేఔట్లను మార్పు చేసి గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించాలని తెలిపారు. అవసరమైన రోడ్లు, విద్యుత్తు త్రాగునీరు, డ్రైనేజీ , నీటిపారుదల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. వీటిని సాధించేందుకు సిపిఐ పెద్ద ఎత్తున లబ్ధిదారులను గుర్తించి పోరాటానికి సిద్ధం చేయాలన్నారు. అలాగే టిడ్కో ఇండ్ల లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను కూడా పూర్తి చేసి సత్వరమే ప్రతి లబ్ధిదారునికి ఇల్లు అందేలా చూడాలన్నారు. ఎన్నికలకు ముందు బాదుడే బాదుడు అన్న చంద్రబాబు ఇప్పుడు ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపుతూ ఉన్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో బాహాబాయిగా కొట్టుకోవడానికి బిజెపి ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతుందని అన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్, గూడూరు నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్ ,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తిరవి, సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, ఏ.ఐ.టి.యు.సి నియోజక వర్గ అధ్యక్ష , కార్యదర్శులు ఎంబెటి చంద్రయ్య, నారాయణ, రమేష్, శేషయ్య, సీతా భాస్కర్, వెంకటయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, యాకోబు, అంకయ్య, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

భోళాశంకరుని సేవలో శృంగేరీ పీఠాధిపతి

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త పంచభూత లింగాల్లో వాయు లింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం శృంగేరీ పీఠాధిపతి విధు శేఖర్ భారతి తమ శిష్యబృందంతో హాజరయ్యారు. ఆయనకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ఇఓటి.బాపిరెడ్డి సారథ్యంలో ఘన స్వాగతం ఏర్పాటు చేసారు. ప్రభుత్వ కార్యక్రమం కాబట్టి అధికారులు ఎంతో జాగ్రత్త వహించారు. అయితే పీఠాధిపతి ఆలయం వద్దకు రాగా వారిని దర్శించుకొనుటకు కొందరు, ఆయన ఆశీస్సుల కోసం మరికొందరు మహిళలు ప్రయత్నించారు. అయితే ఆలయంలో పని చేసే మహిళా సెక్యూరిటి ఓవర్ యాక్షన్‌తో తెలుగుదేశం మాజీ కౌన్సిలర్లు బి.రేణుకాదేవి, అనితలు కంటనీళ్ళు పెట్టుకునే పరిస్థితి చోటు చేసుకుంది. స్వామీజీ రాక సందర్భంగా రెండు రోజులు పాటు ఇఓ బాపిరెడ్డి కుండపోత వర్షంలో కూడా ఏర్పాట్లు సమీక్షించారు. స్వామీజి భక్తులకు కనబడేటట్లు తేరువీధి, బిక్షాల గాలిగోపురం, రంగుల గోపురాల వద్ద నుంచి ఆహ్వానించారు.

కంచుగడప వద్దకు రాగా స్వామీజీతోపాటు రాజకీయ నాయకులు, మహిళా సెక్యూరిటి ప్రవేశించటానికి ప్రయత్నించటంతో గందరగోళ పరిస్థితి చోటు చేసుకుంది. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డిలకు ప్రత్యేకంగా ఆశీర్వదించారు. స్వాగతం చెప్పిన వారిలో జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, కంఠరమేష్, రవీంద్రబాబు, వాకచర్ల గుర్రప్పశెట్టి, మల్లీశ్వరమ్మ, సుమతి, ఆర్ముగం, తదితరులున్నారు.

అల్లిపురంలో విషాదం

కాలువలో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి

నాగేంద్రమ్మ, చింతాలయ్య

చిల్లకూరు, నవంబర్ 16, ప్రభాతవార్త

మండల పరిధిలోని ఏరూరు గ్రామంలో అల్లిపురం గిరిజన కాలనీలో శనివారం విషాదం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన కుడుముల నాగేంద్ర, రావులమ్మ, కుందకూరు ఏడుకొండలు చెంచమ్మలు శనివారం బట్టలు ఊతుకేందుకు పక్కనే ఉన్న నాయుడు సోనాకాలువ వద్దకు వెళ్లారు. బట్టలు ఉతుకుతుండగా వారి వెంట వచ్చిన చిన్నారులు కుడుముల నాగేంద్రమ్మ (10), కుందకూరు చింతాలయ్య (11) ప్రమాదవశాత్తు సోన కాలువలలో మునిగి మృతి చెందారు. ఈ సంఘటన తమ కళ్ళ ముందట జరగడంతో ఆ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

చిన్నారుల కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రమాదవశాత్తు కాలువలో పడి చనిపోయిన చిన్నారుల కుటుంబానికి 10 వేల రూపాయల ఆర్థిక సహాయంను పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మెన్ తానంకి నానాజీ, టిడిపి సీనియర్ నాయకులు పూడిపర్తి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వారికి అందించారు. చిన్నారుల తల్లిదండ్రులను పరామర్శించారు. గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ వారి ఆత్మకుశాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుకుంటూ, పిల్లలను కోల్పోయిన ఆ తల్లితండ్రులకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని, ఆ కుటుంభ సభ్యులకు ప్రగాఢ సానుబూతిని తెలియజేశారు. వారితో పాటు ఏలూరు టిడిపి నాయకులు ఉడత సీనయ్య, ఉడత రాజయ్యలు ఉన్నారు.

మాదనపల్లి పంచాయతీని ఆదర్శంగా మార్చేందుకు కృషిచేస్తాం

పెద్దపంజాణి నవంబరు 16 ప్రభాతవార్త : మాదనపల్లి పంచాయతీని ప్రజల సహకారంతో ఆదర్శపంచాయతీగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషిచేస్తామని సర్పంచు నాగలక్ష్మిరమేష్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, ఎంపీడీఓ భాలాజి ఆధేశాలతో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలోభాగంగా చీమనపల్లి గ్రామంలో పారిశుధ్యకార్యక్రమాల స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోఉన్న మంచినీటిట్యాంకును శుభ్రపరచి బ్లీచింగ్‌చేశారు. అలాగే గ్రామంలో ఉన్న డ్రైనేజీ కాలువలను శుభ్రపరచి దోమలుపెరగకుండా మెలాథీయాన్ స్ప్రే చేశారు. ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణాలకు 12వేలరూపాయల నిధులు అందిస్తోందన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, తెదేపా నేతలు ఎల్లప్ప, మారప్ప, రెడ్డెప్ప, శంకరప్ప, కె. రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలను ప్రశ్నించేలా పత్రికలు ఉండాలి

సోమల, నవంబర్ 16, ప్రభాతవార్త ప్రభుత్వాలు అనాలోచిత నిర్ణయాలను అమలు చేస్తే ప్రశ్నించేలా పత్రికలు ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ నాయుడు అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పత్రిక విలేకరులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 1966 నవంబర్ 16 నుంచి జాతీయ పత్రిక దినోత్సవాలను జరుపుకుంటున్నట్లు ఆయన విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు రోజు క్రమం తప్పకుండా వార్తా పత్రికలను చదివి జ్ఞానం పెంచుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ఈవో గౌతం మాట్లాడుతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విలేకరులు భావ ప్రకటనను తెలియజేసేందుకు పూర్తి స్వేచ్ఛనిచ్చినట్లు ఆయన విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ఆధ్యాపకులు వార్తా విలేకరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కేంద్ర రాష్ట్రాల ధ్యేయం

పుంగనూరు రూరల్, నవంబరు 16 ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ధ్యేయంగా రాష్ట్రీయగ్రామస్వరాజ్య అభియాన్ పథకం అమలులో ఇకపై విప్లవాత్మక చర్యలు చేపడుతు న్నారని ఎంపిపి అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలపరిషత్తు కార్యాలయంలో జరిగిన ఒక్కరోజు శిక్షణా శిబిరంలో ఆయన ప్రసంగించారు. సబ్కియోజన, సబ్కి వికాస్ కార్య క్రమంలో దేశంలోని గ్రామీణ ప్రాంతాల పునర్మిర్మాణ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికార, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోమాలతో దద్దరిల్లిన కాశీవిశ్వేశ్వరాలయం

చౌడేపల్లి, నవంబర్ 16 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిన్నకొండామర్రి వద్దగల విశాలాక్షీ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో వివిధ రకాల హోమాలు నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, అలంకరణలు గావించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో పలు కార్యక్రమాలు జరిగాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఆలయ పునర్నిర్మాణదాత మనోహర్‌చే భక్తులు స్వామివారి పవిత్ర తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది.

ఇంటింటి కొలతలు సేకరించిన దేవాదాయశాఖాధికారులు

చౌడేపల్లి, నవంబర్ 16 ప్రభాతవార్త దేవాదాయధర్మాదాయశాఖాధికారులు ఎట్టకేలకు ఇంటింటికీ వెళ్ళి కొలతలు సేకరించారు. దీంతో దశాబ్దాల తరబడి దేవస్థానం భూమిలో తిష్టవేసుకొని కూర్చొన్న నేతాజీ నగర్ వాసుల్లో ఆందోళన నెలకొంది. శనివారం పుంగనూరు గ్రూప్‌టెంపుల్స్ ఇఓ కమలాకర్ ఆధ్వర్యంలో అధికారులు ఇంటింటికి వెళ్ళి కొలతలు చేపట్టారు.

గోసలకురపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి మాన్యం భూమి సర్వేనంబర్ 180-2లో 1.59ఎకరాల్లో దశాబ్దాల తరబడి స్థిరనివాసాలేసుకొని నివశిస్తున్నారు. వారిపై దేవదాయధర్మాదాయశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. నేతాజీనగర్‌లో తొలుత దేవస్థానం మాన్యం భూమిని సర్వే చేసారు. అనంతరం ఆయా స్థలాల్లో ఎంత వరకు ఆక్రమించుకొన్నారని లెక్కలు కట్టారు. ప్రస్తుతం ఇంటింటికీ వెళ్ళి ఎంత వరకు ఉందని కొలతలు నిర్వహించారు. ఎండోమెంట్ ఇన్స్‌స్టెక్టర్ శశికుమార్, భాస్కర్‌రెడ్డి, విఆర్ఓ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎండోమెంట్ సిబ్బంది హరి, తాతయ్య, మోహన్‌రెడ్డి, మణి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

చౌడేపల్లి, నవంబర్ 16 ప్రభాతవార్త పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక(2025-26)పై ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ లిచ్చారు. శనివారం స్థానిక మండల పరిపాలనా భవనంలో గ్రామాలఅభివృద్ధికిఎలాంటిపనులుచేపట్టాలన్నఅంశాలనుచర్చించారు. ప్రభుత్వనిర్దేశితఅంశాలపైఎంపిడిఓలీలామా ధవి, ఇఓఆర్‌డి కృష్ణవేణిలుశిక్షణలిచ్చారు. మండలంలోని సర్పం చులు, ఎంపిటీసీ సభ్యులు, పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి : జడ్పీటిసి

శాంతిపురం, నవంబర్ 16 ప్రభాతవార్త సమగ్ర ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జడ్పీటిసి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై జిపిడిపి ప్రణాళికల తయారీపై జరిగిన ఒకరోజు శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అధికారులు, ప్రజాప్రతినిధులేకాక ప్రజలు కూడా ప్రణాళికల రూపకల్పనలో భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికల తయారీకి ఆదేశించాయన్నారు. ఎంపిడిఓ పిఆర్ కుమార్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం అనేది ప్రతి ఒక్కరికీ అవసరమని మండల స్థాయిలో పంచాయతీల అభివృద్ధికి తగు ప్రణాళికలను సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో రూపొందించాలని సూచించారు. గ్రామసభలు నిర్వహించి జనవరి 31 కల్లా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి పట్టాభి, సర్పంచ్ ఎవి జయరాం, కోఆప్షన్‌సభ్యుడు నిసార్, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఛలో పలమనేరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

రామకుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త

ఈనెల 23వతేది పలమనేరులో జరిగే మాలల ఐక్యవేదిక సమావేశాన్ని మాలమహానాడు నేతలు విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు డా॥ యమలా సుదర్శనం పేర్కొన్నారు. శనివారం ఈమేరకు రామకుప్పం శివాజీ నగర్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు గుండాల మనోహర్, పెనువేలు సింహా, సతీష్, మహేష్, అంజి, గోవర్ధన్, శ్రీరాములు, రామచంద్ర, రమేష్, కన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

విజయం బిజినెస్ స్కూల్‌లో ప్రెషర్స్ డే సంబరాలు

చిత్తూరురూరల్, నవంబరు 16 ప్రభాతవార్త: చిత్తూరు పట్టణం, సుందరరాజపురంలోని విజయం బిజినెస్ స్కూల్ నందు శనివారం ఎంబిఏ, ఎంసిఏ విద్యార్థులకు ఘనంగా ప్రెషర్స్‌డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న విజయం విద్యాసంస్థల అధినేత డా. ఎం, తేజోమూర్తి, అకాడమిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు డా. ఎం. శైలజమూర్తిలు మాట్లాడుతూ వృత్తిపరమైన కోర్సులతో పోటీ విధానాన్ని ఉత్సాహంగా స్వీకరించాలనీ, విద్యార్థులలో వున్నసాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం కోసం తాము వృత్తిపరమైన కోర్సులను నిర్వహిస్తున్నామని, విద్యార్థులు తమకు అందుబాటులో వున్న వనరులను, అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని సమాజంలో ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

20వతేది బందార్లపల్లిలో ప్రజాదర్బార్ కార్యక్రమం

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ - మన పంచాయతీ వద్దకే మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఈనెల 20వతేది రామకుప్పం మండలం బందార్లపల్లి పంచాయతీలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఇటీవల కంగుందిలో చేపట్టిన ప్రజాదర్బార్ కార్యక్రమంకు ప్రజలనుంచి విశేష స్పందన లభించిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామ్మూర్తినాయుడుకు నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ డా॥ కంచర్ల

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త సిఎం చంద్రబాబు నాయుడు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు శనివారం హైదరాబాదు ఎఐజి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. రామ్మూర్తి నాయుడు మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ హుటాహుటిన హైదరాబాద్ ఎఐజి ఆస్పత్రికి చేరుకుని రామ్మూర్తి నాయుడు మృతదేహానికి ఘన నివాళులు అర్పించారు. కుటుంబీకులైన సినీ నటుడు నారా రోహిత్ తదితరులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రామ్మూర్తి నాయుడు మృతి తీరని లోటని పేర్కొన్నారు.

గంజాయి నిర్మూలనకు సమిష్టి కృషి చేయాలి : కమీషనర్

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త కుప్పం ప్రాంతంలో గంజాయి నిర్మూలనకు అధికార యంత్రాంగం సమిష్టి కృషి చేయాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ కోరారు. కడ పి.డి. వికాస్ మర్మత్ ఆదేశాల మేరకు మండల స్థాయి గంజాయి నిరోధక కమిటీ సమావేశాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో గంజాయి నిర్మూలనకై కడ పి.డి. కమిటీని నియమించారన్నారు. ఇందులో రెవెన్యూ, ఎక్సైజ్, పోలీసు, మండల పరిషత్, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, మున్సిపల్ కమీషనర్ సభ్యులుగా ఉంటారన్నారు. ఈనెల 18వతేది నుంచి క్షేత్రస్థాయిలో గంజాయి సాగు కేంద్రాలు గుర్తించి గంజాయిని అరికట్టేందుకు చర్యలు చేపడ్తామన్నారు. గ్రామాల్లో సైతం విఆర్ఒలు, సచివాలయ ఉద్యోగులు ఎక్కడైనా అక్రమంగా గంజాయి సాగవుతుంటే సమాచారం అందించాలని సూచించారు. కుప్పం మున్సిపాలిటీలో గంజాయికి వ్యతిరేకంగా పోస్టర్లను ఏర్పాటుచేస్తా మని కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ చిట్టిబాబు, ఎక్సైజ్ ఎస్సై మోహన్‌బాబు, ఇఐపిఆర్‌డి విజయ్‌దత్, ఎఇ అమృతవల్లి, హెచ్ఒ డింపుప్రియశ్రీ, విఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులను కలసిన పిరమలై కలర్ సంఘం రాష్ట్ర నేతలు

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త రాష్ట్రంలో ఉన్న పిరమలై కలర్ కులానికి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని పిరమలై కలర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ దేవర్, ఎంబిసి రాష్ట్ర అధ్యక్షుడు పూసలరవి, రాష్ట్ర కార్యదర్శి రాజా తేవర్, రాష్ట్ర ఉప కార్యదర్శి వెంకటేష్ తేవర్, చల్లాకుమార్ తేవర్‌లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, భూగర్భగనులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, శాసనమండలి విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌లను వీరు కలసి వినతిపత్రం అందించారు. పిరమలై కలర్ కులానికి ఎపి గెజిట్‌లో చేర్చాలని అలాగే కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని వారు కోరారు. ఇదే విషయంగా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, టిటిడి బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, బిసి కమీషనర్ జస్టిస్ శంకర్ నారాయణలకు సైతం వినతిపత్రం అందించారు. సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

గ్రంథాలయంలో అలరించిన పుస్తక ప్రదర్శన

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గ్రంథాలయ అధికారిణి సత్యవాణి అధ్వర్యంలో గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. అలాగే ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులకు అ ంకెలు వెతకడం, జ్యామితి చిత్రలేఖనం, తిరకాసు పదాలు వంటి పోటీలు, హాస్టల్ విద్యార్థులకు సొంత కథ రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త సాయిమాతా సేవా ట్రస్ట్ అధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రిచే ఆదివారం కుప్పం బాలుర హైస్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు తెలిపారు. కంటి సమస్యతో బాధపడే ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9391833999నె ంబరును సంప్రదించాలని తెలిపారు.

జర్నలిస్టులకు ఇండ్లు, పెన్షన్ కల్పించండి

పుంగనూరు రూరల్, నవంబరు 16 ప్రభాతవార్త : సమాజసేవే పరమావధిగా జీతభత్యాలు లేకుండా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్లు, పెన్షన్ కల్పించాలని పుంగనూరు ప్రెస్‌క్లబ్ సారథులు ఇన్‌చార్జి తహసీల్దార్ నాగేశ్వర్‌రావుకు శనివారం వినపత్రం సమర్పించారు. ఏపి వర్కింగ్ జర్నలిస్టుల సంఘ రాష్ట్రశాఖ అదేశాలమేరకు జిల్లా అధ్యక్షుడు లోకనాథం సూచనలతో పుంగనూరు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియ ప్రతినిధులు రెవిన్యూ అధికారులను కలసిన తమ సమస్యలు వివరించారు. ఈమేరకు ఏపిడబ్ల్యూజె జిల్లా కోశాధికారి వాలీశ్వర్ మాట్లాడుతూ ఏండ్ల తరబడి పనిచేస్తున్న తమకు ఏప్రభుత్వం లోనూ న్యాయం జరగలేదన్నారు. కార్యక్రమం సంఘ నాయకులు, సభ్యులు గిరిశేఖర్, వాలీశ్వర్‌రెడ్డి, జిఆర్‌మురళి, భానుప్రకాష్, లోకేష్, రెడ్డెప్ప, కార్తీక్, పురుషోత్తంతో పాటూ పలువురు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

బిజెపిలో ప్రతి ఒక్కరు సభ్యులుగా చేరండి

చిత్తూరురూరల్, నవంబరు 16 ప్రభాతవార్త: భారత్‌లో ప్రస్తుతం శాంతి భద్రతలు పటిష్టంగా వున్నాయనీ, ఈ పరిస్థితులకు కారణం బిజెపి నాయకత్వంలోనే కేంద్రప్రభుత్వమని, ఇలాంటి జాతీయవాద పార్టీకి మీరందరూ సహకరించి మద్దతు పలుకుతూ ప్రతి ఒక్కరు బిజెపి పార్టీలో సభ్యులుగా చేరాలని సంతపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిట్టిబాబు కోరారు. శనివారం సెప్టెంబరు నుంచి జరుగుతున్న భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు ప్రగతిపై సంతపేట మండల కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ 50మంది ప్రాథమిక సభ్యులను పార్టీలో చేర్చించిన వారిని క్రియాశీలకసభ్యులుగా పరిగణిస్తారనీ, అలాంటి క్రియాశీలక సభ్యులు కనీసం 25మంది వుంటే మండల కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామభద్ర, బ్రహ్మానందరెడ్డి, తోటపాళ్యం వెంకటేష్, సునీల్‌కుమార్, రవినాయుడు, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సన్నిధిలో కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, నవంబర్ 16 ప్రభాతవార్త: కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్ ఎస్.కినాగి శనివారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, స్థానిక ఎస్సై ధరణీధర, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన చుడా ఛైర్మన్

చిత్తూరు, నవంబర్ 16 ప్రభాతవార్త: కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పుష్పగుచ్చం అందించి కలెక్టర్‌తో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత మాట్లాడుతూ చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్ళడానికి తనకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

సర్పంచ్‌లదే పంచాయతీల అభివృద్ధి బాధ్యత

పాలసముద్రం, నవంబర్ 16 ప్రభాతవార్త: గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి బాధ్యత సర్పంచ్‌ల పైనే వుంటుందని ఎంపిడిఓ మహేష్‌రెడ్డి అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి-2025-26 ప్రణాళిక సిద్ధం చేయడానికి మండల స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎంపిడిఓ మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో వున్న గ్రామ పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి కోసం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనులు ఎంపిక చేసి అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపిటిసీలు, సర్పంచ్‌లు, ఇఓఆర్డీ రమేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి ఢిల్లీప్రసాద్, ఎపిఓ మార్గరేట్, పిహెచ్‌సి సూపర్‌వైజర్ మురళి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలు

పూతలపట్టు, నవంబర్ 16 ప్రభాతవార్త:

పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యం లో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది హాజరై విద్యార్థులు, ప్రజలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంకు తహసిల్దారు గుర్రప్ప హాజరై రక్తపరీక్షలు చేసుకుని మాట్లాడుతూ పరిసరాల్లో రక్తపరీక్షలు చేయడానికి ఏ సంస్థ అందుబాటులో లేకపోవడంతో శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారులు నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ పరీక్షల అనంతరం అర్హులైన వారికి మందులు పంపిణీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి మృతి

చిత్తూరు, నవంబర్ 16 ప్రభాతవార్త: చిత్తూరు మెకానికల్ గ్రౌండ్స్ సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు బివిరెడ్డి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 2వ తరగతి చదువుతున్న జయనిరాశ్(7) మృతి చెందాడు. చిత్తూరు దుర్గానగర్ కాలనీలో నివాసం వుంటున్న కిరణ్, స్వప్న దంపతుల కుమారుడు జయనిరాశ్. ఇతను బివిరెడ్డి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో 2వ తరగతి చదువుతుండగా శనివారం జయనిరాశ్ తల్లి స్వప్న కుమారుడిని స్కూటీపై తీసుకుని స్కూల్‌లో వెళ్ళడానికి వెళ్తుండగా మెకానికల్ గ్రౌండ్స్‌కు సమీపంలో ఇసుక లోడ్డుతో వున్న ట్రాక్టర్ స్కూటీని గుద్దడంతో స్కూటీలో వెళ్తున్న స్వప్న ఓ వైపు పడిపోగా జయనిరాశ్ ట్రాక్టర్ చక్రాల కింద పడిపోయాడు. జయనిరాశ్‌పై ట్రాక్టర్ చక్రాలు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

బంగారుపాళ్యం, నవంబర్ 16 ప్రభాతవార్త: స్థానిక గ్రంథాలయ శాఖ కార్యాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఎంఇఓ నాగేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విజ్ఞాన సమపార్జన పుస్తక పఠనం ద్వారా వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు నిత్యం చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే బాలల దినోత్సవంను గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టి విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వం పోటీలు నిర్వహించి విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ-2 రమేష్, హెడ్మాస్టర్ ధనంజయరాజు, లైబ్రరీయన్ శ్రీకాంత్‌రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై సమగ్ర నివేదిక

బంగారుపాళ్యం, నవంబర్ 16 ప్రభాతవార్త: గ్రామాల అభివృద్ధిపై సమగ్ర నివేదికలు రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారిణి పార్వతమ్మ కోరారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామీణ అభివృద్ధిపై సమగ్ర శిక్షణ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఇందులో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొనగా వారిని ఉద్దేశించి జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకుగాను గ్రామాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులపై నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల అంగీకారంతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ శ్రీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

18న లోబావిలో లక్ష దీపోత్సవం

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసంలో నిర్వహించే దీపారాధనలో ఈ ఏడాది పలు మార్పులుచేర్పులు చేసినట్లు ఇఓ టి.బాపిరెడ్డి వివరించారు. ఈ ఏడాది కార్తీక మాసం సోమవారాల్లో ఒక్కొక్క వారం ఒక్కొక్క కోనేరులో లక్ష దీపారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేసారని ఇఓ వివరించారు. మూడవ సోమవారం ప్రదోష కాల సమయంలో భరద్వాజ తీర్థంలో లక్ష దీపోత్సవం నిర్వహించబడుతుందని ఇఓ వివరించారు. ఇప్పటికే నారదపుష్కరిణి, వైష్ణవ కోనేరుల్లో లక్ష దీపార్చన నిర్వహించామని మూడవది లోబావిలో నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. సాయంత్రం 5-6గంటలకు లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

సెల్‌ఫోన్ల భద్రపరచు కార్యాలయం : ఇఓ

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరా లయంలో సెల్‌ఫోన్ల సంప్రదా యానికి స్వస్

కల్యాణ వెంకన్న దర్శనంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారిని శనివార తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఆలయ ఏఈఓ ఎం.గోపినాద్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారథి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవ సేవలో పాల్గొని, అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

మహిళా అభివృద్ధితోనే గ్రామాలు అభివృద్ధి

–డిఆర్‌డిఏ పిడి శోభన్‌బాబు

తిరుపతిరూరల్,నవంబర్16 ప్రభాతవార్త:

మహిళా అభివృద్ధితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని డిఆర్‌డిఏ పిడి శోభన్‌బాబు అన్నారు. శనివారం తిరుపతిరూరల్ మండల మహిళా సమాఖ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి శోభన్‌బాబు మాట్లాడుతూ ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదగటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ, ముద్ర, పిఎం విశ్వకర్మ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ సమావేశంలో ఎపిఎం నాగేశ్వరరావు, ఏరియా కో–ఆర్డినేటర్లు, ఎపియం, సిసిలు, మండల సమాఖ్య ఇసి సభ్యులు పాల్గొన్నారు.

రామూర్తినాయుడు మరణం...చంద్రగిరి ప్రజలకు తీరనిలోటు

–మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతిరూరల్,నవంబర్16 ప్రభాతవార్త:

చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మరణం బాధాకరమని, ఆయన మృతి నియోజకవర్గ ప్రజలకు తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. అందరికి మంచి చేసే మనస్సున్న వ్యక్తిగా రాజకీయ రంగంలో అజాత శత్రువుగా ఉన్నారని తెలిపారు. పార్టీలకు మతాలకు, కులాలకు అతీతంగా సేవలు అందించారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరి

– తిరుపతిరూరల్ ఎంపిడిఓ రామచంద్ర

తిరుపతిరూరల్,నవంబర్16 ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు అవసరమని, గ్రామ పంచాయతీలలో సుపరిపాలన దిశగా ముందుకు వెళ్ళాలంటే చక్కటి ప్రణాళికతో ముందుపోవాలని ఎంపిడిఓ రామచంద్ర తెలిపారు. శనివారం తిరుపతిరూరల్ ఎంపిడిఓ సమావేశ మందిరములో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికపైన ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీలకు వచ్చే నిధులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు గ్రామాల్లో జరిగిన పురోగతి, భవిష్యత్ ప్లాన్ ఆఫ్ యాక్సన్‌పై చర్చించారు. వ్యవసాం, పశుసంపద, సచివాలయ వ్యవస్థ పనితీరు, చిన్నతరహా, కుటీరపరిశ్రమలు, గృహ నిర్మాణం, తాగునీరు, పేదరికి నిర్మూళన, వృత్తి విద్య, ఆహారం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అచ్యుతం,శ్రీపథం నిర్మాణాలపై బోర్డులో చర్చిస్తాం

తిరుపతి(రవాణా),నవంబర్ 16ప్రభాతవార్త:

తిరుపతిలో గోవిందరాజస్వామి సత్రాలు కూల్చి వేసిన స్థానంలో నిర్మాణపనులు సాగుతున్న అచ్యు తం, శ్రీపథంపై సోమవారం బోర్డు సమావేశంలో చర్చిస్తామని టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ సత్రాలను 2016లో 10కోట్ల రూపాయలు వ్యయం చేసి మరమ్మతులు చేపట్టారని, వాటిని కూల్చివేసి 2023 సెప్టెంబర్‌లో అప్పటి టిటిడి బోర్డు ఆమోదించడం జరిగిందన్నారు. భానుప్రకాష్‌రెడ్డి ,బిజెపి నేతలు సామంచి శ్రీనివాస్, భాస్కర్,వరప్రసాద్,సుబ్బయాదవ్, జీవన్‌రాయల్‌తో కలసి శనివారం ఈ పనులు జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. గత బోర్డులో పెద్దలు కేవలం 10నుండి 15శాతం కమీషన్‌లకోసమే కక్కుర్తిపడి కాంట్రాక్టర్లకు అప్పగించారనే ఆరోపణ చేశారు.

భక్తిని చాటిచెప్పిన నగరసంకీర్తన

తిరుపతి(రవాణా),నవంబర్ 16ప్రభాతవార్త:

ఆధ్యాత్మికనగరం తిరుపతిలో రాయలసీమ రంగస్థలి ప్రతి శనివారం ఉదయం నిర్వహించే నగర సంకీర్తన భక్తుల్లోనూఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఉందని రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. శనివారం వేకువజామున నగరసంకీర్తనలో భాగంగా గోవిందరాజస్వామి ఆలయ మాధవీధుల్లో రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, సుశీల, మునికుమారి, పద్మావతి, కల్పన, ఉషారాణి, పార్వతి, ధనలక్ష్మి, నిర్మలవాసురెడ్డి, మునినాథరెడ్డి, శాంభోలు హరినాథ్, పొన్నాల జేజిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజు, రాజశేఖర్‌రెడ్డి, వాసు,సాయిరెడ్డి తదితరులు కళాకారులతో కలసి నుదుటిన నామం ధరించి భక్తితో భజనలతో నగరంలో గోవింద నామ సంకీర్తనలు హోరెత్తాయి.

మాజీ ఎమ్మెల్యే నారా రామూర్తి నాయుడు మృతి తీరని లోటు

కల్లూరు, నవంబర్ 16, ప్రభాతవార్త మాజీ ఎమ్మెల్యే నారా రామూర్తి నాయుడు మృతి తీరని లోటని పులిచేర్ల మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. ఆయన మృతి చెందడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. సంతాపం తెలిపిన వారిలో మండల నాయకులు కుమార్ రెడ్డి, మురళీ, రవి నాయుడు, ఉయ్యాల రమణ, పోసంవారి పల్లి, పంచాయితీ జయచంద్ర రెడ్డి, యోగానందరెడ్డి, బాలాజీ, ప్రభాకర్, సురేఖ, దాము, డిల్లి బాబు, హరిబాబు, ప్రకాష్ నాయుడు, గోపి నాయుడు ఉన్నారు.

2025 సంవత్సరం దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీకాళహస్తి,నవంబర్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం 2025 కాలమాన పట్టిను తయారు చేసి శనివారం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి చే ఆవిష్కరింపజేసారు. సాధారణంగా కొత్త సంవత్సరంప్రారంభం అయిన నెలకు కూడా కొత్త కాలమానపట్టినకు ఆవిష్కరించే వారు కాదు.కానీ ఈ ఏడాది ఒకటిన్నర ముందుగానే ఆవిష్కరించటం పరిపాలనలో మార్పుకు నిదర్శనం.ఈ సందర్భంగా శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలమాన పట్టికను ముందుగానే రూపకల్పన చేసి ఆవిష్కరించటం అభినందనీయం అన్నారు. అధికారులు అభివృద్ధిలో ఇలాగే పరుగులు తీయాలని సూచించారు. కాగా గతంలో క్యాలండర్ ధర ఒకటి రూ.125లు కాగా ఈ ఏడాది కేవలం రూ.100లకే అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.క్యాలండర్‌లో మొదటి స్వామి అమ్మవార్ల విశ్వరూపం రెండవ పేజీలో స్వామి వారి నిజస్వరూపం, 3వ పేజీ శివరాత్రి కైలాసగిరి ప్రదక్షిణం,నాలగవ పేజీలో అమ్మవారి నిజస్వరూపం, ఐదవ పేజీలో నాయనార్లు,ఆరవ పేజీలో స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం ఏడవ పేజీలో మేధా దక్షిణామూర్తి, ఎనిమిదవ పేజీలో ఆరుద్ర అభిషేకం,9వ పేజీలో హాహా విష్ణు అవతారంలో అమ్మవార్లు 10వ పేజీలో హంసవాహనం,11వ నెలలో స్వర్ణమ్మ హారతులు 12 పేజీలో రాహుకేతువుల చిత్రాలను ఆయిల్ పెయింటింగ్‌లో రూపొందించారు. వీటిని ఎంఎల్ఏ ఆవిష్కరించారు.

పారదర్శకత పాలన: ఈ సందర్భంగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయంలో అవినీతి లేని పారదర్శకత,జవాబుదారితనం పాలనను అందిస్తున్నట్లు వివరించారు. అందుకు నిదర్శనమే క్యాలండర్ ధర తగ్గింపు.గత పాలకులు శివరాత్రి పర్వదినాన కుటుంబ వ్యవస్థతో నిర్వహించే వారు. రాబోవు శివరాత్రి లో తమ ప్రమేయం ఉండదని అంతా అధికారులే పర్యవేక్షిస్తారని భక్తులకు సుదర్శనం కల్పిస్తున్నట్లు వివరించారు.దళారులను పూర్తిగా అణచివేసే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.దేశంలోని అన్ని రాష్ట్రాలను భాగస్వాములు చేసి అతిథి గృహాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవస్థానం సారధ్యంలో ఓ ఆసుపత్రిని నడిపించేందుకు అపోలో మేనేజ్‌మెంట్‌తో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో 540 మంది ఉద్యోగుల సంక్షేమానికి నిర్ణయం తీసుకుంటున్నామన్నారు.కార్యక్రమంలో ఇఓ బాపిరాజు, ఎసి కస్తూరి, శ్రీహరి, డిప్యూటీ ఈవో ఎన్ఆర్‌కృష్ణారెడ్డి, ఎఈఓ లోకేష్‌రెడ్డి, హేమమాలిని, డిఈఈ మురళీధర్‌రెడ్డి, పిఆర్‌ఓ విద్యాసాగర్,టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ప్రోటోకాల్ అధికారి నాగభూషణం, తెదేపా నాయకులు చెంచయ్యనాయుడు, జడ్పీటిసి వెంకటసుబ్బారెడ్డి, కంటా రమేష్, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

నారా రామమూర్తి నాయుడు మృతి బాధాకరం..ఎంఎల్ఏ.

శ్రీకాళహస్తి, నవంబర్ 16 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సోదరుడు నారా రామమూర్తినాయుడు స్వర్గస్తులవడం బాధాకరం అని ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ నారా రామ్మూర్తినాయుడు మన నుంచి దూరమవడం బాధాకరం అన్నారు. ఆయన లేని లోటు ఎవ్వరు తీర్చలేనిదన్నారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని కోరుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.నేడు ఆయన సంతాపసభ పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రామ్మూర్తినాయుడు మృతికి ఎమ్మెల్యే నివాళి

పుత్తూరు, నవంబరు 16 ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తమ్ముడు, చంద్రగిరి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతికి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాశ్ నివాళి అర్పించారు. హైదరాబాద్‌లోని ఎఐజి ఆస్పత్రిలో శనివారం ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భౌతిక కాయానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

నేటి నుంచి రుద్రాభిషేకం, కల్యాణ మహోత్సవాలు

వడమాలపేట, నవంబరు 16 ప్రభాతవార్త:

స్థానిక భవానీశంకర దేవాలయంలో నేడు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఆరుద్ర నక్షత్ర పూర్వక 11వ వార్షికోత్సవ రుద్రాభిషేక కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 17న ఆదివారం గోపూజ, గణపతి పూజ, ఏకాదశి రుద్ర కలశస్థాపన, సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు,18నసోమవారం రుద్రాభిషేకం, చండీహోమం, విశేష ద్రవ్యాలతో అభిషేకం, అర్చన, సాయం త్రం సహస్ర నామార్చన,కుంకుమార్చన,ఊంజల్‌సేవ,19నమంగళవారంఉత్సవమూర్తులఅభిషేకం, రుద్రహోమం,సుదర్శనహోమం,సాయంత్రంపార్వతీపరమేశ్వరులకల్యాణంనిర్వహిస్తున్నట్లునిర్వాహకులు తెలిపారు.

తిరుపతిలో డురియన్ లగ్జరీ ఫర్నిచర్ స్టోర్ ప్రారంభం

తిరుపతి విద్య నవంబర్ 16,ప్రభాతవార్త:

డురియన్ లగ్జరీ ఫర్నిచర్ తిరుపతిలోని తన మెట్టమొదటి షోరూంను శనివారం ప్రారంభించింది.స్థానిక ఆర్ సి రోడ్డు లోని ఆ సంస్థ నూతన షోరూం ప్రారంభం సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లోని ఇళ్లకు విలాసవంతమైన ఫర్నిచర్ను చేసే ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని అని అన్నారు.40 సంవత్సరాలకు పైగా విస్తరించిన వారసత్వంతో,అధిక–నాణ్యత,ఆకర్షనీయమైన,మన్నికైన ఫర్నిచరు అందించడంలో విశ్వనీయ సంస్థగా డురియన్ ఫర్నిచర్ మారిందన్నారు.ఇది సొగసైన,ఆధునిక సమకాలీన పీస్ ల నుండి కాలాతీత క్లాసిక్ స్టైల్ వరకు విభిన్న డిజైన్ లు ఉన్నాయని తెలిపారు. సోఫాలు, రెక్లైనర్లు,బెడ్స్,డైనింగ్ టేబుల్లు,కాఫీ టేబుళ్లు మరిన్నింటిని అందజేస్తుంది అని,ప్రతి ఒక్కరి అభిరుచి,శైలికి అనుగుణంగా రూపొందించబడిందన్నారు.ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టొయోటో సరికొత్త ఆఫర్లు

తిరుపతి విద్య నవంబర్ 16,ప్రభాతవార్త:

అద్భుతమైన సంవత్సరాంతపు ఆఫర్లతో టయోటా కిర్లోస్కర్ మోటార్ గ్లాంజా,అర్బన్ క్రూయిజర్ టైసర్ అండ్ అర్బన్ క్రూయిజర్ హైడ్రైయర్ ప్రత్యేక లిమిటెడ్ –ఎడిషన్ ను పరిచయం చేశామని ఆ సంస్థ వైస్ ప్రసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు.శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల విడుదల చేసిన ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్లకు అద్భుతమైన స్పందన వచ్చిన తరువాత,స్పెషల్ లిమిటెడ్ –ఎడిషన్ టయోటా జెన్యూన్ యాక్సెసరీ(టిజిఎ) ప్యాకేజీలను అందించి వినియోగదారులను మెప్పించేందుకు కొత్త ఆఫర్లు పెట్టామన్నారు.స్పెషల్ లిమిటెడ్ ఎడిషన్ కాకుండా,టొయోటా గ్లాంజా,అర్బన్ క్రూయిజర్ టైసర్ అండ్ రూమియన్(సిఎన్ జి మోడల్లు మినహా)లో రూ.1 లక్షపైన ప్రత్యేకమైన ఇయర్ ఎండ్ ఆఫర్లను అందిస్తోంది.వినియోగదారు ప్రయోజనాలు 31 డిసెంబర్ వరకు ఈ ఆఫర్లు కొనసాగుతాయన్నారు.తమ కంపెనీ వెబ్సైట్లో ఇతర వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

న్యూ డిజైర్ కారు మార్కెట్లోకి విడుదల

తిరుపతి విద్య నవంబర్ 16,ప్రభాతవార్త:

మారుతి సుజుకి సంస్థ నూతనంగా రూపొందించిన ఫోర్త్ జనరేషన్ న్యూ డిజైర్ కారును భార్గవి ఆటోమెబైల్స్ ఆధ్వర్యంలో శనివారం మార్కెట్లోకి విడుదల చేశారు.స్థానిక రేణిగుంట రోడ్ లోని మారుతి సుజుకి షోరూం వద్ద జరిగిన కార్యక్రమానికి జాయింట్ ట్రాన్స్ ఫోర్ట్ కమిషనర్ డాక్టర్ బి కృష్ణవేణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఈ కొత్త డిజైర్ యువతరానికి నచ్చేలా సరి కొత్త డిజైన్లతో అత్యాధునిక మారుతి కారును మార్కెట్లోకి విడుదల చేశారు అన్నారు.ఇందులో సిక్స్ ఎయిర్ బ్యాగ్స్ ఉండటం వల్ల సేఫ్టీ మెరుగైందన్నారు.ఎలక్ట్రిక్ సన్ రూఫ్,ఎల్ ఈ డి క్రిస్టల్ విజన్ హెడ్లాంప్స్,360 హెచ్ డి వ్యూ కెమెరా,వైర్లస్ చార్జర్,ఈ కొత్తవాహనం సరికొత్త కెఎంపిఎల్ అందిస్తుందన్నారు.ఈ కారు ఏడు రంగుల్లో లభ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో భార్గవి ఆటో మొబైల్ ఎండి కొండా నిరంజన్ రెడ్డి ఈవో కొండా ఈశ్వర్ రెడ్డి,దీపక్,జిఎం రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

19న సీడాప్ జాబ్ కనెక్ట్ ప్రొగ్రాం

తిరుపతి విద్య, నవంబర్ 16,ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా లోని నిరుద్యోగులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) ఆధ్వర్యంలో నడుస్తున్న సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ ప్రైజ్ డెవెలప్మెంటల్ ఇన్ ఆంధ్రప్రదేశ్(సీడాప్) లో ఈ నెల 19న సీడాప్ జాబ్ కనెక్ట్ ప్రోగ్రాం జరగనున్నట్లు పీడీ శోభన్ బాబు తెలిపారు.తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డు లోని ఎంఆర్వో కార్యాలయం వెనుక ఉన్న డీఆర్డీఏ భవనంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టుకు ఇంటర్వ్యూ లు ఉంటాయని,ఇంటర్,డిగ్రీ అర్హత కలిగి సొంత టూవీలర్.లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.ఇతర వివరాలకు 9701387283,6302280583 కి సంప్రదించాలని కోరారు.

ఆ నాటి కృషి వలనే నేడు సమాజంలో గ్రంథాలయాలు అభివృద్ధి చెందాయి

పుత్తూరురూరల్, నవంబరు 16 ప్రభాతవార్త:

గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గ్రంథాలయ శాస్త్ర ప్రముఖులు రంగనాథంలను స్మరిస్తూ పూజా కార్యక్రమం పుత్తూరులోని గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథులుగా విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిణి మీనకుమారి మాట్లాడుతూ గ్రంథాల ఉద్యమకారులు ఆ నాటి కృషి వలనే నేడుసమాజంలో గ్రంథాలయాలు అభివృద్ధి చెందాయని, విద్యార్థుల తమ జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలను సంపూర్ణంగా వినియోగించుకోవాలని తమ బంగారు భవిష్యత్ గ్రంథ పఠనం ద్వారా సాధించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

మానవత్వంతో కొనసాగించండి సారూ...!

తిరుపతి విద్య, నవంబర్ 16,ప్రభాతవార్త:

ఎస్వీయూలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులను వర్సిటీ అధికారులు మానవత్వంతో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని,గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులు వేడుకుంటున్నారు.ప్రభుత్వాలు మారితే తమకు ఉద్యోగ భద్రత కరవుతోందని,సేవలను గుర్తించకుండా ఉన్న ఫలంగా తమను తొలగించడం సమంజసం కాదని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పాత కాంట్రాక్టర్ తప్పుకోగా,అదే వర్సిటీలో రిటైర్డ్ ఉద్యోగికి కాంట్రాక్ట్ ఇచ్చారని,ఇప్పటికే 10 మంది కార్మికులను విధులను తొలగించారని,మరో 40 మందిపై వేటుకు రంగం సిద్ధమైందని మదనపడుతున్నారు.కొత్త కాంట్రక్టర్ వర్సిటీకి తాము చేసిన సేవలను దృష్టిలో ఉంచుకుని కొనసాగించే విధంగా అధికారులు చొరవతీసుకోవాలన్నారు.

పరిశుభ్రతతోనే పరిపూర్ణ ఆరోగ్యం

ఎంబియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.కృపావతి

చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త:

పరిశభ్రతతోనే పరిపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మోహన్‌బాబు యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.కృపావతి అన్నారు. ఎంబియు, స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఎంబిఎ, బికామ్, బిబిఎ స్టూడెంట్స్ శనివారం కొటాల గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో ఎన్ఎస్ఎస్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోజనానికి ముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిశుభ్రత కారణంగా అనారోగ్యం బారినపడే ప్రమాదం వుందన్నారు.

మాజీ ఎంఎల్ఏ రామ్మూర్తి నాయుడు మృతి తీరనిలోటు

టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు

చంద్రగిరి, నవంబర్ 16 ప్రభాతవార్త:

మాజీ ఎంఎల్ఏ నారా రామ్మూర్తి నాయుడు మృతి నియోజకవర్గ ప్రజలకు తీరనిలోటని టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. అనారోగ్యంతో వైద్య చికిత్సలు పొందుతూ తదిశ్వాస విడిచారని అన్నారు. ఎంఎల్ఏగా 5 కాలంలో తనపనితీరుతో నియోజకవర్గ ప్రజల ఆధరాభిమానాలను పొందారని కొనియాడారు. నారావారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ఆత్మస్థైర్యం కలిగించాలని ఆకాంక్షించారు.

రామ్మూర్తినాయుడు మృతి బాధాకరం : ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతిరూరల్,నవంబర్16 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి బాధాకరమని, ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నట్లు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. 1994–99 వరకు చంద్రగిరి ఎమ్మెల్యేగా రామ్మూర్తినాయుడు సేవలు అందించారని తెలిపారు. రామ్మూర్తినాయుడు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతున్నారు.

తిరుపతి డివిజన్

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

పాకాల, నవంబర్ 16, ప్రభాతవార్త పాకాల మండలం ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ సూరినేనివారిపల్లెలో వెలసిన గురప్ప స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పూజలో భాగంగా మూడవ రోజు శనివారం ఉదయం మహన్యాస పూర్వ ఏకాదశి రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. తిరుపతి కృష్ణదాస్ బృందం శివగానామృతం ఆలపించారు. సాయంత్రం విశ్వశాంతికై లక్ష్మి గణపతి హోమం , సుదర్శన హోమం , మృత్యుంజయ హోమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలను తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బుజ్జి బాబు నాయుడు, ఉభయదారులు కుమార స్వామి నాయుడు, నరేంద్ర, రమ, మునిరత్నం నాయుడు, బాలాజీ శెట్టి , సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి ఘన నివాళి

పాకాల నవంబర్ 16 ప్రభాతవార్త

పాకాల మండలం పాకాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాజీ చంద్రగిరి ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి శనివారం సాయంత్రం పూలమాలవేసి అభిమానులు టిడిపి కార్యకర్తలు నివాళులర్పించారు.

పిల్లల ఆరోగ్య విషయంలో జాగ్రత్త ఉంచండి : ఎంపీ

సత్యవేడు, నవంబరు 16 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గం సత్యవేడు జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలకు చెందిన 56 మంది విద్యార్థులు విష జ్వరాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని విషయం తెలుసుకున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి స్థానిక వైసీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్‌తో కలసి శనివారం విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, త్రాగునీరు, దోమలు, అక్కడ దుస్థితి గురించి వైద్యసేవల గూర్చి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వసతి గృహంలోని భోజనశాలను ఎంపీ పరిశీలించారు. వంటశాలలో నాసిరకం కూరగాయలు ఉపయోగిస్తుండడం గమనించి హాస్టల్ వ్యార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని వార్డెన్‌కి సూచించారు. హాస్టల్‌లో నాసిరకం కూరగాయలు వినియోగించడంపై జిల్లా కలెక్టర్, జాయింట్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎంపీపీ ప్రతిమ, మాజీ జడ్పీటీసీబీరేంద్రవర్మ,సుశీలకుమార్‌రెడ్డి,నిరంజన్‌రెడ్డి, బెల్ట్ రమేష్, వైసీపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళ పట్ల అసభ్య ప్రవర్తన కేసులో నిందితుడు అరెస్టు

సత్యవేడు, నవంబరు 16 ప్రభాతవార్త: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి, కోర్కె తీర్చమని నాన రభస సృష్టించి ఇబ్బంది పెట్టిన నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు సత్యవేడు శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు విలేకరులతో పేర్కొన్నారు. ఈ నెల 11న తమిళనాడుకు చెందిన ఓ మహిళ శ్రీసిటీ పరిధిలోని ఆరూరుకు ఓ పరిశ్రమలో ఇంటర్వ్యూ నిమిత్తం రావడం, ఆరూరు గ్రామానికి చెందిన స్టాలిన్ అనే వ్యక్తి బైక్‌లో పరిశ్రమ వద్దకు తీసుకెళ్తానని చెప్పి దారి మళ్లించి సమీప మామిడి తో

గూడూరు డివిజన్

ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి అధ్యాపకురాలికి డాక్టరేట్

కోట, నవంబర్ 16 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఎలక్ట్రికల్ విభాగం అధ్యాపకురాలు పి.ధనసెల్వి జెఎన్‌టియు అనంతపురం విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఇంటిలిజెంట్ పవర్ సిస్టం స్టెబిలైజర్స్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ ట్రాన్సిఎంట్ స్టెబిలిటీ ఇన్ మల్టీ మిషన్ పవర్ సిస్టం అనే అంశంపై పరిశోధనకు గాను ఆమె డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయంగా జరిగే వర్తమాన మరియు భవిష్య సాంకేతిక ఆవిష్కరణలు, అధ్యాపకులు అధ్యయనం చేసి తద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు కళాశాల యాజమాన్యం ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా బి.ధనసెల్విని కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.సురేష్‌రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

మంత్రి లోకేష్ ప్రకటన పట్ల హర్షం

బాలాయపల్లి, నవంబర్ 16 ప్రభాతవార్త : రాష్ట్ర శాసనసభలో విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ఉపాధ్యాయులపై నాటి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తి వేస్తామని ప్రకటించడం పట్ల ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ తాళ్ళూరు శ్రీనివాసులు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో కలిసి గత ప్రభుత్వ కాలంలో ఉద్యోగ, ఉపాధ్యా యులు తమ హక్కులను సాధించుకోవడానికి, వేతన సవరణ అమలు చేయాలన్నారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు నేడు అసెంబ్లీలో ప్రకటన చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

స్కూల్‌కి పరికరాలు వితరణ

సూళ్లూరుపేట, నవంబర్ 16 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలం ఇలుపూరు పంచాయతీ వెంగళాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పిల్లలకు అవసరమైన బెంచీలు, ఆట వస్తువులు, భోజనం ప్లేట్లు, గ్లాసులు వితరణగా అందజేశారు. కోగిలి జయరామిరెడ్డి ఛారిటబుల్ సొసైటీ వారు చిన్న బడులకు చేయూత అనే నినాదంలో భాగంగా ఈ వస్తువులను పాఠశాల చిన్నారులకు అందజేశారు. స్కూలు హెడ్మాస్టర్ విడవలూరు జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోగిలి జయరామిరెడ్డి ఛారిటబుల్ సొసైటీ ఛైర్మన్ కోగిలి సురేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు బెంచీలు, ఆట వస్తువులు, నోటు పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఆయనతో పాటు ఎంఇఓలు శ్రీనివాసులురెడ్డి, శీనయ్య కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, రాజేష్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దుగరాజపట్నం పోర్టు నిర్మాణాన్ని ప్రారంభించాలి / -తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్

గూడూరు, నవంబర్ 16 ప్రభాతవార్త : రాష్ట్రం పునర్విభజన చట్టంలో పేర్కొన్న వాకాడు మండలం లోని దుగ్గరాజపట్నం వద్ద పోర్టు నిర్మాణాన్ని ప్రారంభించాలని తిరుపతి మాజీ ఎంపి చింతామోహన్ డిమాండ్ చేశారు. శనివారం గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ దుగరాజ పట్నం పోర్టు నిర్మాణం జరిగితే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందని యువతకు ఉపాధిఅవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను అమలు చేయడంలో ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో :

సూళ్ళూరుపేట, వెంకటగిరి,గూడూరు నియోజకవర్గాలు అబివృద్ధి చెందాలంటే దుర్గరాజపట్నం ఓడరేవు నిర్మాణపనులు వెంటనే చేపట్టాలని తిరుపతి మాజీ పార్లమెంటు సభ్యులు డాక్టర్ చింతా మోహన్ అన్నారు. ఆయన శనివారం నాయుడుపేట అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ దుర్గరాజ పట్నం ఓడరేవును నిర్మించడం వలన ముంబై, చెన్నై మహా నగరాలకు దీటుగా ఈప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందు తుందన్నారు. సమావేశంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు గాడి వెంకటయ , శివ,రమణయ్య, రమేష్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు కీలకంగా వ్యవహరించాలి

బాలాయపల్లి, నవంబర్ 16 ప్రభాతవార్త : గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతి నిధులు కీలక పాత్ర పోషించాలని ఎంపిపి గూడూరు భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన బాలాయపల్లి మండల సమాఖ్య కార్యాలయంలో సర్పంచు లు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని తెలిపారు. బాలాయపల్లి మండల సమాఖ్య కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు జిపిడిపి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా పంచాయతీలను పటిష్ఠపరచాలని సూచించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీజీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్, ఎంపీపీ గూడూరు భాస్కరరెడ్డి , వైస్ ఎంపీపీ వాన పార్వతిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్లు షేక్ మోళి. జింక లీలావతి. దయాకర్. మోహన రాజు శిక్షణ ఇచ్చారు.

రాష్ట్ర హోం మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

గూడూరు, నవంబర్ 16 ప్రభాతవార్త : అసెంబ్లీ సమావేశంలో భాగంగా విజయవాడకు వెళ్లిన ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్‌తో కలసి అమరావతి సచివాలయంలో శనివారం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను గూడూరు నియోజకవర్గ టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి గూడూరు సమస్య లను తెలిపారు. హోం శాఖ మంత్రిని కలిసిన వారిలో గూడూరు నియోజకవర్గ టిడిపి నాయకులు బిల్లు చెంచురామయ్య, తాతపూడి ఇశ్రాయేల్, కుమార్, ఎం.డి. అబ్దుల్ రహీం, ఈసంశెట్టి నటశేఖర్, షేక్ షాహుల్, పట్రంగం వసంత్‌లు ఉన్నారు.

పేద మహిళకు చారిటబుల్ ట్రస్ట్‌చే ఆర్థిక సాయం

చిల్లకూరు, నవంబర్ 16 ప్రభాతవార్త : నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చిల్లకూరు గ్రామానికి చెందిన సంక్రాంతి శైలజ అనే పేద మహిళ వైద్య ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు మండలంలోని చేడిమల గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు చారి టబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు ట్రస్ట్ సభ్యుడైన బాబు ద్వారా శనివారం హాస్పిటల్లో అందజేశారు. ఆర్థిక సహాయం అందించినటువంటి రాజునేని శ్రీనివాస్ నాయుడుకి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆ కుటుంబ సభ్యులు తెలిపారు.

టాలెంట్ టెస్ట్ ను అడ్డుకుంటామని : ఏబీవీపీ కన్వీనర్

గూడూరు, నవంబర్ 16 ప్రభాతవార్త : కార్పొరేట్ కాలనాగులను ప్రోత్సహించకూడదని ఏబివీపి కన్వీనర్ చిన్నా పేర్కొన్నారు. శనివారం స్థానిక గూడూరు పట్టణంలో గల ఏబీవీపీ నాయకులు పత్రికా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ చిన్నా మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలలో పదవ తరగతిలో బాగా చదివే విద్యార్థుల యొక్క అడ్రస్సులు అడ్మిషన్లు డేటా చోరీకై కార్పొరేట్ మాఫియా టాలెంట్ టెస్ట్ పేరుతో పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షకు ప్రైవేటు యాజమాన్యం సహకరించవద్దు అని ఏబీవీపీ గూడూరు శాఖ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నదన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించి పరీక్ష నిర్వహిస్తే ఆ పరీక్షను అడ్డుకుంటామని ఏబీవీపీ తెలియజేసారు. ఈ పత్రిక సమావేశంలో ఏబీవీపీ నాయకులు జయ, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయాన్ని...

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధం చేస్తాం: ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మండలాల్లో గల ఆలయాలను శ్రీకాళహస్తీశ్వరాలయంతో అనుసం ధానం చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి వివరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ చరిత్ర,పర్యాటక ప్రాధాన్యత కల్గిన ఏర్పేడు మండలంలోని పరశురామేశ్వరాలయాన్ని అభివృద్ధి చేయటానికి కేంద్రం నుంచి నిధులు కోరినట్లు వివరించారు. ప్రసాద్ స్కీంలో ఆలయాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిం చినట్లు వివరించారు. ఏర్పేడు మండలంలోని పరశురామేశ్వరాలయం,శ్రీకాళహస్తి మండలం లోని తొండమాన్ పురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిం చాలని అధికారులను సూచించినట్లు తెలిపారు. ముఖ్యంగా గుడిమల్లం ఆలయం ను శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా తీసుకొనుటకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గతంలో తన తండ్రి గోపాలకృష్ణారెడ్డి హయాంలో ఈ ఆలయాన్ని అనుబంధం చేయటానికి ప్రయత్నాలు జరిగాయన్నారు, కానీ అమలు జరగలేదన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం టూరిజంశాఖతో చర్చించామన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి నుంచి గుడిమల్లం- తొండమాన్‌పురం- శ్రీకాళహస్తీశ్వరాలయంకు పర్యాటక శాఖ ప్యాకేజీని ఏర్పాటు చేసి 40 నిముషాల్లో చేరుకునే రీతిలో రూపొందించినట్లు వివరించారు. తిరుపతి నుంచి గుడిమల్లంకు పాపానాయుడుపేట నుంచి రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని సుధీర్‌రెడ్డి వివరించారు.

అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలని చేయూత

తిరుపతి (క్రీడ), నవంబర్ 16 ప్రభాతవార్త : అంతర్జాతీయ క్రీడలకు ఎంపికై సింగపూర్‌కు వెళ్ళనున్న బిసీఎం హై స్కూల్ విద్యార్థిని లాస్యను తిరుపతి మానవత సభ్యులు శనివారం ఆశీర్వదించారు. సింగపూర్ లో విజయం సాధించి దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని మానవత చైర్మన్ భార్గవ, కో చైర్మన్ మాధవ నాయుడు, కరస్పాండెంట్ కృష్ణమూర్తి నాయుడు, హెడ్మాస్టర్ ప్రియా, అధ్యక్ష కార్యదర్శులు ఎంవి రమణ, సుకుమార్ రాజు సభ్యులు మనోహర్ యాదవ్‌లు ఆకాంక్షించారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మానవతాచే పదివేల రూపాయల చెక్కును లాస్య తల్లి గీతాకు అందజేశారు. చిన్నతనం నుంచి సేవా దృక్పథంతో విద్యార్థులు మెలగాలని క్రమశిక్షణతో ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. మంగళం బీ సీ ఎం హై స్కూల్లో 9వ తరగతి చదువుతున్న కే లాస్య రోప్ జంపింగ్ ఈవెంట్ ఇంటర్నేషనల్ స్పోర్ట్స్‌కు ఎంపికవడంలో పాఠశాల యాజమాన్యం కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు : సిహెచ్‌ఓ

యాదమరి, నవంబర్ 16 ప్రభాతవార్త: రాష్ట్రీయ ఆరోగ్య స్వస్థ కార్యక్రమంలో ప్రతి పాఠశాల విద్యార్థికి పక్కాగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని యాదమరి పిహెచ్‌సి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ ఆరోగ్య స్వస్థ కార్యక్రమం ద్వారా వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను శనివారం సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ యాదమరి అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని దీనికోసం ప్రత్యేకంగా రాష్ట్రీయ ఆరోగ్య స్వస్థ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పిహెచ్‌సి పరిధిలో వున్న ప్రతి అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్య సిబ్బంది నాలుగు రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ పరీక్షల్లో ఎదైనా తేడా వస్తే వారిని మెరుగైన చికిత్స నిమిత్తం పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సెల్వరాణి, లక్ష్మీపతి, ఆరోగ్య కార్యకర్త జ్యోతి, అంగన్‌వాడీ వర్కర్ రేఖ, ఆశా కార్యకర్తలు వినాయకి, ఆరుణలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలన

కోట, నవంబర్ 16 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు గురుకులంలో నాడు-నేడు పనులను ఎంఇఓ మస్తానయ్య పరిశీలించారు. గురుకుల పాఠశాలలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రూ.5 లక్షలు వ్యయంతో పిఎం-3 పథకం కింద జరుగుతున్న ల్యాబ్ పనులను కూడా ఆయన పరిశీలించారు. అనంతరం చిట్టేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తీరుతెన్నులపై ఆరా తీశారు. ఆపార్ ఐడి జనరేషన్ ఎంతవరకు పూర్తయిందనే వివరాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

బ్యాంకు ఖాతాలు డిజిటలైజేషన్ చేయించుకోవాలి

కోట, నవంబర్ 16 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇచ్చే రాయితీలకు బ్యాంకు ఖాతాలు తప్పనిసరి అని ఎంపిడిఓ వేణు చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయాల పరిధిలో లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలను డిజిటలైజేషన్ చేయించుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. దీని ప్రకారం లబ్ధిదారులతో పాటు 18 ఏళ్లు నిండిన వారంతా ఎన్‌పిసిఐ అనుసంధానంతో కూడిన ఐపిపి ఖాతాలు తెరవాలని పేర్కొన్నారు. ఇందుకు సచివాలయాల్లో సంక్షేమ సహాయకులకు అనుసంధానం చేయించే బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. ఖాతాలు ప్రారంభించడానికి చరవాణి నంబర్, ఆధార్‌కార్డు ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని పోస్టాఫీసుల్లో కూడా వీటిని అనుసంధానం చేస్తారని తెలిపారు.

ఎన్‌సిసి యూనిట్ ప్రారంభం

కోట, నవంబర్ 16 ప్రభాతవార్త : కోట పట్టణంలోని శ్రీ ప్రగతి విద్యాసంస్థలోని డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎన్‌సిసి యూనిట్ మంజూరైంది. శనివారం 24 ఆంధ్రా బెటాలియన్‌కి చెందిన ఆర్మీ అధికారులు జగన్ మోహన్ రావు, ఆనంద్‌లు ఎన్‌సిసి పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులను ఎంపిక చేశారు. వారిలో అర్హులైన 25 మంది విద్యార్థులను ఎన్‌సిసికి ఎంపిక చేసినట్లు ప్రకటించారు. అనంతరం శ్రీ ప్రగతి విద్యాసంస్థల ఛైర్మన్ పి.కిషోర్ విద్యార్థులను అభినందించారు. ఎన్‌సిసిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ ఎం.మునెయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

-సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

బాలాయపల్లి, నవంబర్ 16 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై ప్రజలు ఇస్తున్న వినతి పత్రాలను పరిశీలించి పరిష్కరించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. తాసిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక చేశారు. వెంగమాంబ పురం, కాలగందా, పల్లిపాడు గ్రామాల్లో వచ్చిన వినతి పత్రాలను ఎందుకు పరిష్కరించలేదని తాసిల్దార్ శ్రీనివాసులు ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాసిల్దార్ కార్యాలయం కూలేస్థితిలో ఉన్నందున సచివాలయం భవనం లోకి మార్చాలని సూచించారు. సచివాలయం భవనంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయాన్ని సొంత భవనంలోకి మార్చితే అక్కడికి తాసిల్దార్ కార్యాలయాన్ని మార్చాలని తెలిపారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ తాసిల్దార్ శిరీష, ఆర్ ఐ శ్రీకాంత్ ఉన్నారు.

ఇంటింటా ఆరోగ్య సర్వేకై 3లక్షలతో వైద్య పరికరాలు

- కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్-వైద్యాధికారుల ద్వారా ఎఎన్‌ఎంలు..ఆరోగ్య సిబ్బందికి పంపిణీ !!

కుప్పం, నవంబర్ 16 ప్రభాతవార్త : చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో చేపట్టనున్న ఆరోగ్య సర్వే నిర్వహణకు సంబంధించి మూడు లక్షల రూపాయల విలువ చేసే వైద్య పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కడ కార్యాలయంలో వైద్యాధికారులకు 100 బిపి ఆపరేటర్లు, 100 గ్లూకో మీటర్లను పంపిణీ చేశారు. పిడి మాట్లాడుతూ వీటిని ఆయా పిహెచ్‌సిల పరిధిలో ఉన్న ఎఎన్‌ఎంలు, ఎ ంఎల్‌హెచ్‌పిలకు వైద్యులు అందిస్తారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం, కుప్పం మున్సిపాలిటీల పరిధిలో ప్రతి ఇంటా వైద్య సిబ్బంది సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఓ కుటుంబంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు సేకరిస్తారన్నారు. అనంతరం వారికి వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, డా॥ వెంకటేష్, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ పాల్ శ్రీనివాస్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

వెలుగులోకి తీసుకువచ్చేలా బాధ్యతగా విధులు

- నేషనల్ ప్రెస్ డే సందర్భంగా పాత్రికేయులతో కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, నవంబర్ 16 ప్రభాతవార్త: పాత్రికేయ రంగానికి సమాజంలో విలువ వుందని, పాత్రికేయులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేలా బాధ్య తగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రం చిత్తూరులో జిల్లా ఎపియుడబ్ల్యుజె, చిత్తూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎపియుడబ్ల్యుజె, చిత్తూరు ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా విలేకరుల సమస్యలను ఎపియుడబ్ల్యుజె, చిత్తూరు ప్రెస్‌క్లబ్ నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, జర్నలిస్టులు అందరికి అక్రిడిటేషన్‌లు మంజూరు చేయాలని, జర్నలిస్టులపై దాడులను కట్టడి చేయడానికి జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎపియుడబ్ల్యుజె అధ్యక్ష, కార్యదర్శులు లోకనాథం, మురళీకృష్ణలు, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌బాబు, కాళీశ్వర్‌రెడ్డిలు, నాయకులు అశోక్‌కుమార్, శివకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

బాలాయపల్లి, నవంబర్ 16 ప్రభాతవార్త : చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఓ.అనూష తెలిపారు. వెంగమాంబ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. విద్యారులకు చట్టాలపై వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి ఓ.అనూష పాల్గొన్న న్యాయవాదులు దుగ్గి రాజారావు, అద్దంకి గాంధీ నాయుడు, సుంకర రాజేష్, హెచ్‌ఎం సుమతి వివరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై, భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్ మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దు అని న్యాయవాది సుంకర రాజేష్ తెలిపారు. బాలికలు మనోధైర్యాన్ని కలిగి ఉండాలి హెచ్‌ఎం సుమతి చెప్పారు. ఫోటో

అక్రమంగా అమ్ముతున్న మద్యం బాటిళ్లు పట్టివేత

వాకాడు, నవంబర్ 16 ప్రభాతవార్త : వాకాడు మండలం కొండాపురం వడ్డీ పాలెం గ్రామంలోని శనివారం అక్రమంగా 12 మద్యం బాటిల్స్ అమ్ముతుండగా రెడ్ హ్యాండెడ్‌గా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పట్టుకున్నారు. వాకాడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, గూడూరు టాస్క్ ఫోర్స్ సిఐ బాలకృష్ణ ఇరువురు కలిసి మండలంలోని బెల్ట్ షాపులపై దాడులు చేపట్టారు. కొండాపురం వడ్డీపాలెం గ్రామం లోని యనమల శీనయ్య అక్రమంగా మద్యం అమ్ముతుండగా వెళ్లి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిపై ఆగిన వాహనాలు!

నాయుడుపేట టౌన్ నవంబరు 16 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని జాతీయ రహదారిపై ఓలారీ మరమ్మత్తులకు గురికావడంతో నెల్లూరు-తిరుపతి మార్గంగుండ వెళ్ళే వాహనాలు రహదారిపై ఆగిపోవండతో ప్రయాణికులు- వాహనదారులు అవస్థలుపడ్డారు. నెల్లూరు-తిరుపతి మార్గంగుండ వెళ్ళే వాహనాలు అధికసంఖ్యలో నిలిచిపోవడంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ంది, విషయం తెలుసుకొన్న నాయుడుపేట పోలీసులు సంఘటన స్థలంకు చేరుకొని మరమ్మత్తులకు గురైన లారీని పక్కకు తొలగించి వాహనాల రాకపోకలుకు అంతరాయం లేకుండ చర్యలు చేపట్టారు.రెండుగంటలు ఆలస్యంగా వాహనాల యదావిదిగా రాకపోకలు సాగించారు.

విద్యార్థులకు బహుమతులు, మెమోంటోలు బహుకరణ

గూడూరు, నవంబర్ 16 ప్రభాతవార్త : గూడూరు చెకుముకి మండల స్థాయి పరీక్షలలో విజేతలుగా నిలిచిన చిల్లకూరు మండల ప్రభుత్వ,ప్రైవేటు స్కూల్స్ విద్యార్థినీ, విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌ఏపిస్కూల్ నందు చెకుముకి పోటీలు నిర్వహించారు. వాటిలో గెలు పొందిన విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎం.ఈ.ఓ. రవూఫ్, ఎల్.ఏ.పీ.స్కూల్ ప్రిన్సిపల్ శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా మెమొంటోలు, బహుమతులు అందజేసారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక వారు విద్యార్థులను భావి, భారత పౌరులుగా, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా తీర్చిదిద్దేందుకు సైన్స్ పరీక్షలు నిర్వహిస్తూ వారిలో చైతన్యాన్ని నింపటం చాలా గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, ఎల్. ఏ.పి. హెచ్. ఎం. సురేష్, నాగర